

మార్గం సుగమమేనా..?!

- గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి అడ్డంకులు
- ప్రశ్నార్థకంగా భూసేకరణ
- పరిహారం సరిపోతుదంటున్న రైతులు
- ఎకరాకు రూ. 40 లక్షల డిమాండ్
- భూపాలపల్లి జిల్లాకు 130.5 హెక్టార్ల అవసరం

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మంచిర్యాల-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలో సుమారు 25 కిలో మీటర్ల మేర ఈ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకు 130.5 హెక్టార్ల భూమి అవసరం ఉండగా సేకరణ విషయంలో కొన్ని అవరోధాలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ రహదారికి మార్గం సుగమయ్యేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని 14 గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం కానుంది. ఇందుకు 515 రైతులకు చెందిన 326.5 ఎకరాలు (130.5 హెక్టార్లు) భూమి అవసరం ఉంది. చిట్యాల మండలంలోని కల్వపల్లి, గిద్దముత్తారం, నవాబుపేట, టేకుమట్ల మండంలోని రాఘవపూర్, పెద్దంపల్లి, పంగిడిపల్లి, ఆశిరెడ్డిపల్లి, రామకృష్ణపూర్ (టి), అంకుషాపూర్, టేకుమట్ల, సుబ్బక్కపల్లి, మొగుళ్లపల్లి మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపూరం, మెదరిమేట్ల గ్రామాల పరిధిలోని భూముల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించేందుకు డీపీఆర్‌ను రూపొందించారు. పెద్దపల్లి జిల్లా నుంచి భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండలం కాల్వపల్లిలో జాతీయ రహదారి మొదలై మొగుళ్లపల్లి మండలం రంగాపూరం మీదుగా హనుమకొండ జిల్లాలోకి ప్రవేశించనుంది.

ఎకరాకు రూ.40 లక్షల డిమాండ్

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని 14 గ్రామాల పరిధిలోని 130.5 హెక్టార్ల భూమిని వినియోగించనున్న నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. భూసేకరణపై రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. సేకరణ కోసం గుర్తించిన భూములకు చెందిన రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు జారీ చేసి అవార్డులు రూపొందించారు. రిజిస్ట్రేషన్ ధరకు రెండు నుంచి మూడు రెట్ల పరిహారం చెల్లించేందుకు సిద్ధమని వివరించారు. అయితే.. ఈ మండలాల్లో రిజిస్ట్రేషన్ ధర రూ.2 లక్షల వరకు ఉంది. దీన్నిబట్టి రైతులకు రూ. 4 లక్షల నుంచి 6 లక్షలు మాత్రమే పరిహారం అందనుంది. దీనిపై రైతులు సుముఖంగా లేరు. తమకు మార్కెట్ ధర ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు రూ. 40 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. అయితే... రైతులు పరిహారంపై జిల్లా మెజిస్ట్రేట్ వద్ద పిటీషన్ దాఖలు చేస్తే మరింత పరిహారం అందే అవకాశం ఉంది.

సర్కారు భూముల నుంచి సాధ్యమేనా?


భూపాలపల్లి జిల్లా నుంచి సుమారు 326 ఎకరాల విస్తీర్ణంలో జరుగునున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి రైతుల నుంచి భూసేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. హైవే నిర్మాణంతో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ భూముల నుంచి రహదారి నిర్మాణం చేసేందుకు భూములను గుర్తించాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రంగంలో కి దిగిన అధికారులు సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే.. డీపీఆర్ సిద్ధమైన తర్వాత రోడ్డు నిర్మాణానికి ఇతర మార్గంలోకి మరల్చే ఆలోచన ఆచా రణ సాధ్యమేనా..? అనే ప్రశ్నలు తెలుత్తుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ భూములు కూడా హైవే నిర్మాణ పరిసరాల్లో అంతంత మాత్రంగానే ఉన్నట్లు సమాచారం.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం

రాష్ట్రంలోని నేషనల్ హైవే నిర్మాణంలో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. భూసేకరణ త్వరితగతిన పూర్తి చేసి హైవే అధికారులకు భూములు అప్పగించాలని కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు మెరుగైన పరిహారం అందించి భూసేకరణ చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు రైతులతో కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశమయ్యారు. నేషనల్ హైవే అధికారులు ఇచ్చే పరిహారం సరిపోకపోతే జిల్లా మెజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకోవాలని, దీంతో మరింత ఎక్కువగా అందించే అవకాశం ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదే క్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించే ఇతర జిల్లాల్లో జరుగుతున్న భూసేకరణ, రైతులకు చెల్లిస్తున్న పరిహారంపై భూపాలపల్లి జిల్లా అధికారులు ఆరా తీస్తున్నారు.

మెరుగైన పరిహారం అందిస్తాం

- గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం అందిస్తాం. భూసేకరణలో చాలా మంది సన్నకారు రైతులు మాత్రమే ఉన్నారు. వారి కుటుంబాలకు ఆదుకునే బాధ్యత మాపై ఉంది. ఇతర జిల్లాలో జరుగుతున్న భూసేకరణలో రైతులకు అందిస్తున్న విధంగా ఇక్కడా చెల్లిస్తాం.

మళ్లీ పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, ఆగస్టు 25 : గోదావరి మళ్లీ పెరుగుతోంది. మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పోటెత్తింది. భారీ వర్షాలు కురవడంతోపాటు ప్రాణహిత కాళేశ్వరం వద్ద పరుగులు తీస్తోంది. 20 రోజులుగా గోదావరి తగ్గుముఖం పట్టగా ఆదివారం నుంచి మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. పుష్కరఘాట్ నుంచి వరద ఉధృతంగా ఉంది.

తుపాకులగూడెం వద్ద..

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహిత నుంచి వరద వస్తుండటంతోపాటు ఎగువన ఉన్న బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతుండటంతో గోదావరి వరద ఉధృతమైంది. ఎగువ నుంచి 2,77,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టులోని మొత్తం 59 గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద 76.80 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 77.40 మీటర్ల నీటి ప్రవాహం నమోదైంది.

'దేవాదుల' పంపింగ్ బంద్

కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌ను నిలిపి వేశారు. శనివారం వరకు ఫేజ్- 2,3, నుంచి మూడు మోటార్ల ద్వారా నీటిని భీంఘణపూర్‌కు ఎత్తి పోసిన అధికారులు పంపింగ్‌ను ఆదివారం నిలిపి వేశారు.

మేడిగడ్డ బ్యారేజీకి 2.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 25: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి 2.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3.50 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

కాళేశ్వరాలయానికి శ్రావణ శోభ



కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, ఆగస్టు 25 : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానంలో ఆదివారం సందడి నెలకొంది. శ్రావణమాసంతోపాటు వారాంత సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానంలో స్వామి వారికి మహారుద్రాభిషేకంతో పాటు పలు ప్రత్యేక పూజలు చేశారు. శుభానందా దేవి ఆలయంలో కుంకుమ పూజలతోపాటు సరస్వతీ అమ్మవారికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

వికసిత భారత్ బీజేపీ లక్ష్యం

రాష్ట్ర అధికార ప్రతినిధి కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న పోరెడ్డి కిశోర్

ములుగు, ఆగస్టు 25: అవినీతికి ఆస్కారం లేని భారతదేశ అభివృద్ధి బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ ఆదివారం ములుగులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇచ్చే విధంగా కేంద్రంలో బీజేపీ పాలన సాగుతోందని, పార్టీకి బూత్ స్థాయిలో బలాన్నిస్తూ అత్యధిక సభ్యత్వాలను నమోదు చేయించాలని అన్నారు. ప్రతీ బూత్‌లో 200కు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల మధ్య ఎండగట్టాలన్నారు. సెప్టెంబరు 1 నుంచి 25 వరకు మొదటి విడత, అక్టోబరు 1 నుంచి 25 వరకు రెండో విడత సభ్యత్వ నమోదును చేపట్టాలన్నారు. నాయకులంతా ఈ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవీంద్రాచారి, భర్తాపురం నరేష్, నియోజకవర్గ కన్వీనర్ జాడి వెంకట్, సభ్యత్వ నమోదు కన్వీనర్ మండల లవన్, కన్వీనర్ చెవుగాని స్వప్న, నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణాకర్‌రావు, రవీందర్‌రెడ్డి, రాంబాబు, సురేష్, ఓమ్రా, రాజ్‌కుమార్, రవిరెడ్డి, రాయంచు నాగరాజు, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెత్తకుప్పలో సిరప్ సీసాలు

ఎక్స్‌పైరీ గడువున్నా పారేసిన వైనం



చెత్తకుప్పలో 2025 జూన్ వరకు ఎక్స్‌పైరీ ఉన్న సిరప్ సీసాలు

ములుగు, ఆగస్టు 25: అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న కాలం. జ్వరం, జలుబుతో అనేకమంది ఇబ్బంది పడుతున్నారు. మలేరియా, డెంగీ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ చేయాల్సిన టానిక్ సీసాలు ఆరుబయట పడేయడం విస్మయ పరిచింది. ములుగు నుంచి బండారుపల్లికి వెళ్లేదారిలో కోస్టల్ కార్యాలయం సమీపంలోని నిర్జన ప్రదేశంలో ఇరవైకి పైగా ఫెనిరమైన్ మలేట్ సిరప్-15ఎంజీ (60ఎంఎల్), సిట్రిజన్ ఓరల్ లిక్విడ్ ఐపీ-5ఎంజీ (30ఎంఎల్) సీసాలు ఆదివారం కనిపించాయి. వాకింగ్ కోసం అటువైపు వెళ్లిన వారు ఒకేచోట ఇన్ని సీసాలను గమనించారు. సీసాలపై 2025 వరకు ఎక్స్‌పైరీ గడువుండటంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. ప్రధానంగా జలుబు, దగ్గు, దురదతో బాధపడుతున్న చిన్న పిల్లలకు వాడే ఈ మందులను ఇలా నిర్లక్ష్యంగా పడేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సీసాలపై తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు స్పష్టంగా ముద్రించి ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో అందుబాటులో ఉండాల్సిన మందులను బయట పడేసిందెవరో తెలియరాలేదు. ప్రస్తుత సీజన్‌లో ఈ సిరప్‌ల వాడకం ఎక్కువగా ఉండగా కొన్ని గతంలో అనేక సందర్భాల్లో వీటి కొరత ఏర్పడ్డ సందర్భాలూ ఉన్నాయి.

రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలి

బహుజన వికాస్ వేదిక రాష్ట్ర చైర్మన్ సాగర్

ములుగు, ఆగస్టు 25: రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూనే సామాజిక చైతన్యాన్ని మేల్కొలిపే బాధ్యతను నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని బహుజన వికాస్ వేదిక రాష్ట్ర చైర్మన్ ఈర్ల సాగర్ అన్నారు. ములుగులోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో ఆదివారం గోల్కొండ భిక్షపతి అధ్యక్షతన సమావేశం జరిగింది. బాధ్యతాయుతమైన వ్యవస్థ నిర్మాణం దిశగా బహుజన వికాస్ వేదిక ప్రయత్నిస్తోందని సాగర్ అన్నారు. సామాజిక పోరాటాలు చేస్తూనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ములుగు జిల్లాలో బహుజన వికాస్ వేదిక నిర్వహణ అవసరముందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా మోతె రమేష్, ప్రధాన కార్యదర్శిగా రాగుల శంకర్, ఉపాధ్యక్షులుగా గద్దల రాజేందర్, కోశాధికారిగా అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా గోల్కొండ భిక్షపతి నియమితులయ్యారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతి, యాకయ్య, రవీందర్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

అన్నారం బ్యారేజీలో మళ్లీ పరీక్షలు



బోటులో వెళ్తున్న శాస్త్రవేత్తలు

మహదేవపూర్, ఆగస్టు 25 : కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలో మళ్లీ నీటి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎన్డీఎస్‌ఏ సిఫార్సు మేరకు సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో అన్నారం బ్యారేజీలో ఇప్పటికే పలు పరీక్షలు నిర్వహించగా మరికొన్ని చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో పూణేకు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు అన్నారం బ్యారేజీ వద్దకు ఆదివారం చేరుకొని ఆధునిక పద్ధతిలో పరీక్షలు ప్రారంభించారు. శాస్త్రవేత్తలు సురేష్, మూర్తి బోటులో ప్రయాణిస్తూ పరీక్షలు చేస్తున్నారు. నీటి సామర్థ్యం, ప్రవాహం ఎంత మేర విడుదల అవుతుందనే అంచనాలు తీసుకున్నారు. మొదటి దఫాలో మూడు రోజుల పాటు పరీక్షలు సాగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఈఈ యాదగిరి పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర



రామప్పలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 25 : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. వెంకటాపూర్ మండలంలోని రామప్పలో ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. రామప్పకు 28న సాయంత్రం 3గంటలకు రామప్పకు గవర్నర్ చేరుకుంటారన్నారు. సుమారు గంటన్నరపాటు పర్యటిస్తారని, ప్రత్యేక పూజల్లో పాల్గొని రామప్ప సరస్సును పరిశిలిస్తారని తెలిపారు. గవర్నర్ పర్యటనలో ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సదానందం, నీటిపారుదల శాఖ డీఈ రవీందర్, డీఎంహెచ్‌వో అప్పయ్య, టూరిజం అధికారులు నాథన్, ములుగు సీఐ శంకర్, వెంకటాపూర్ ఏఎస్సై జక్కుల సతీష్, రామప్ప హరితహోటల్ మేనేజర్ శ్రావణ తదితరులు ఉన్నారు.

విష జ్వరంతో ఒకరి మృతి

వాజేడు, ఆగస్టు 25: విషజ్వరంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాయబాట్ల గ్రామానికి చెందిన అల్లి నారాయణ(46 మూడు రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు. దీంతో అతడిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. జ్వరం అదుపులోకి రాకపోగా పరిస్థితి విషమించడంతో శనివారం వరంగల్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో శనివారం అర్ధరాత్రి నారాయణ మృతిచెందాడు. మృతుడికి డెంగీ, చికెన్‌గున్యా లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏజెన్సీ మండలమైన వాజేడులో విష జ్వరాలు రోజు రోజుకూ పెరుగుతూ ప్రజల ప్రాణాలు తీసున్నాయి. ఇప్పటికే విష జ్వరాల బారిన పడి ఇద్దరు మహిళలు మృతి చెందగా తాజాగా మరొకరు ప్రాణాలు విడిచారు.



అల్లి నారాయణ(ఫైల్)

బొగతలో సండే సందడి

తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద సందడి నెలకొంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జలపాతం నిండుగా ప్రవహిస్తోంది. బొగత అందాలను చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. హైదరాబాద్, వరంగల్, ములుగు, ఖమ్మం, భద్రాచలం, భూపాలపల్లి, తదితర నగరాలు, పట్టణాల నుంచి తరలివచ్చారు. సెల్ఫీలు దిగుతూ మైమరచిపోయారు.

- వాజేడు

బొగత వద్ద పర్యాటకులు



ఔషధ గుణాల గాడిద పాలు

● 10 మి.మీ. రూ.100కు అమ్మకం ● ఇంటి వద్దకే విక్రయాలు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 25: గాడిద పాలను చిన్నారులకు తాగించేందుకు నగరవాసులు అమితాసక్తిని కనబర్చుతున్నారు. పలు ఔషధ గుణాల కలిగిన గాడిద పాలను చిన్నారులకు తాగించడం ద్వారా జన్యు పరమైన లోపాలు, అనారోగ్య సమస్యలు దూరం చేస్తూ ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ప్రచారంలో ఉంది. కేవలం 10 మిల్లీలీటర్ల గాడిద పాలకు రూ.100 తీసుకుంటున్నారు. అక్కడే పిండి విక్రయాలు చేస్తున్నారు. పాల ఖరీదు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. హనుమకొండలో కొందరు వీధి వీధికీ గాడిదలను తిప్పుతూ ఇళ్ల వద్దకే వచ్చి అక్కడే పాలను పిండి విక్రయిస్తున్నారు.

జీవనాధారం

తాతలు, తండ్రి వారసత్వంగా గాడిదలను పెంచి పాలను విక్రయిస్తూ దాదాపు 15ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నట్లు గాడిద పాల విక్రయదారుడు జమ్మికుంటకు చెందిన కోట రవి అనే వ్యక్తి చెబుతున్నాడు. రోజంతా నగరంలోని పలు కాలనీలలో మైకులో ద్వారా ప్రచారం చేస్తూ గాడిద పాల విక్రయిస్తున్నా మన్నారు. రోజుకు సుమారు రూ.800 నుంచి రూ.1000 రాగా, అందులో నుంచి గాడిద దాణాకు రూ.300 వరకు ఖర్చులు పోగా.. మిగిలిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపాడు. ఇటీవల కాలంలో చాలాచోట్ల కొందరు గాడిదల ఫామ్‌లు పెట్టి పాల విక్రయాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారని చెప్పారు.



గాడిద పాలు విక్రయిస్తున్న దృశ్యం



బొడ్రాతు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణిదేవి, ప్రముఖులు

రచయితలే సమాజాన్ని చైతన్యం చేసేది

బొడ్రాతు కథా సంపుటి ఆవిష్కరణలో ఎమ్మెల్సీ వాణిదేవి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25: సమాజాన్ని చైతన్య వంతం చేసే బాధ్యత ముమ్మాటికీ రచయితలదేనని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలోని పీఆర్ రెడ్డి భవన్‌లో చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీ వేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణిదేవి, ఉపాధ్యాయురాలు, రచయిత్రి రావుల కిరణ్మయి కలం నుంచి జాలువారిన బొడ్రౌతు కథా సంపుటితో పాటు పీవీ నర్సింహారావు ఉయ్యాల పాట గ్రథాలను ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ.. పాట రూపంలో పీవీ చరిత్ర రాయడం గొప్ప ప్రయోగమని పేర్కొన్నారు. కవులు, రచయితలు సమాజ పక్ష సాహిత్యాన్ని సృజింప చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. రియాజ్ మాట్లాడుతూ.. కిరణ్మయి కథలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయన్నారు. పీవీ ప్రపంచ ఆస్తి అని, ఎంత సాహిత్యం సృజించినా తక్కువేనన్నారు. పల్లె జీవితంపై తెలంగాణ భాష, యాసపై పట్టుతో మంచి గ్రంథాలు వెలువరించిన రాధాకృష్ణ సాహితీ వేదికను ప్రశంసించారు. డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, జానపద విజ్ఞాన శాస్త్ర వేత్త ఆచార్య ఎన్. భక్తవత్సల్‌రెడ్డి, రావుల పుల్లాచారి, డాక్టర్ గడ్డం వెంకన్న, ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ గ్రంథాలను బీవీఎన్ స్వామి, మెరుగు అనురాధ తమదైన శైలిలో అద్భుతంగా సమీక్షించారు. కళా రాజేశ్వర్‌రావు, బిల్ల మహేందర్, పీవీ మదన్‌మోహన్, బాలబోయిన రమాదేవి, కానుగుల భద్రయ్య, గుండు రవి, తదితర అనేక మంది భాషా పండితులు పాల్గొన్నారు.

కొత్తకొండ దేవాలయ ముఖ్య అర్చకుడికి స్వర్ణకంకణం ప్రదానం

భీమదేవరపల్లి, ఆగస్టు 25 : మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయ ముఖ్య అర్చకుడు మొగిలిపాలెం రాంబాబు దంపతులకు తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు జాతీయ కార్యదర్శి దైవజ్ఞశర్మ స్వర్ణకంకణంతో పాటు అవార్డును ఆదివారం అందజేశారు. తెలంగాణ నుంచి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా పనిచేస్తున్న రాంబాబును ఎంపిక చేశారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో నక్షత్ర దీక్షలు ప్రారంభించి పలువురు భక్తులకు వీరభద్రస్వామి మాలలను గత 20 ఏళ్ల నుంచి రాంబాబు చేస్తున్నాడు. దీనికి గుర్తింపుగా మొగిలిపాలెం రాంబాబు ధర్మపత్ని లలితాదేవిలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఘనంగా సన్మానించి స్వర్ణకంకణాన్ని ప్రదానం చేశారు. అనంతరం మొగిలిపాలెం రాంబాబు-లిలితాదేవి దంపతులను హైద్రాబాద్‌లోని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తమ ఇంటికి రప్పించి ఘనంగా సన్మానించారు.



రాంబాబుకు స్వర్ణకంకణం తొడుగుతున్న నిర్వాహకులు

ఐకార్ గుర్తింపు ఎస్సార్‌యూ సన్నద్ధం

హసన్‌పర్తి, ఆగస్టు 25: మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల ఐకార్ గుర్తింపు కోసం సన్నద్ధమైనట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ వ్యవసాయ కళాశాల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు కనీసం మొదటి బ్యాచ్ విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు విజయవంతంగా డిగ్రీలు పొందడంతో ఐకార్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన ప్రమాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కళాశాలలో విభాగాల వారీగా బోధనా, బోధనేతర సిబ్బంది, ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రదర్శన కృషి ఫారమ్ సౌకర్యాలున్నాయని తెలిపారు. ఇవి డీన్స్ కమిటీ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి మార్గదర్శకాలతో అనుగుణంగా ఉన్నాయన్నారు. ఐకార్ గుర్తింపు పొందడానికి అన్ని అర్హతలున్నాయని, ఈగుర్తింపు ద్వారా విద్యా ప్రమాణాలు మరింత బలపడి వ్యవసాయరంగానికి విశేష కృషి చేసేలా కళాశాల సన్నద్ధమవుతుందని తెలిపారు.

ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రవికుమార్

వడ్డెపల్లి, ఆగస్టు 25 : ఆటో డ్రైవర్ల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక ఆటో డ్రైవర్ల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జాక్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గుడిమళ్ల రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ఆరులక్షల మంది ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకునేందు కోసం తక్షణమే ప్రతీ ఆటో డ్రైవర్‌కు ప్రతీ ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జీవిత బీమా ప్రభుత్వమే కల్పించడంతో పాటు ఆటో రిక్షాలపై ట్రాఫిక్, ఫెనాల్టీని వెంటనే నిలిపివేయాలని అన్నారు. ఆటోడ్రైవర్లపై ఫైనాన్షియర్ల దాడులను అరికట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో టీఏడీయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘం మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయ్యాల ప్రవీణ్, బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అబీబ్, జేఏసీ రాష్ట్ర జిల్లా నాయకులు జేరిపోతుల కుమార్, శానబోయిన రాజ్‌కుమార్, మోడెం విద్యాసాగర్, దార మధు, చల్ల విక్రమ్, కట్ట రాంకుమార్, అకినపల్లి అంజయ్య, మర్రి కృష్ణ, మద్దెల రాజేందర్, ఆవుల నవీన్, పిల్లి ఆనంద్, మాతంగి శివరాజ్, ఆమంచ ప్రశాంత్ , ఆకుల వెంకటేశ్వర్లు, గుండాల రాజు, పెసరు శివ పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లి వానరం

మృతి చెందిన పిల్ల బతుకుతుందేమోనని తాపత్రయం

కేసముద్రం, ఆగస్టు 25: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ రెండో గేటు వద్ద ఆదివారం ఉదయం ఒక తల్లి కోతి అప్పటికే మృతి చెందిన తన పిల్లను తీసుకుని వచ్చింది. పిల్లవానరం ఎలా చనిపోయిందోగాని తన పిల్ల ఎప్పటికైనా లేస్తుందేమోనని తపనతో తల్లి వానరం దాని కళేబరాన్ని తన వెంటనే తీసుకువెళుతోంది. కొద్దిసేపు గేటు వద్ద కళేబరాన్ని ఉంచి పలుమార్లు తట్టి లేపుతూ దీనంగా అరుస్తుండడంతో చూపరులు అయ్యో పాపం అంటూ చలించిపోయారు.



చనిపోయిన పిల్లను లేపుతున్న తల్లి వానరం



బీపీ మండల్‌కు నివాళులర్పిస్తున్న విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగులు

విద్యుత్‌శాఖలోని పదోన్నతులు చట్టవిరుద్ధం

హనుమకొండ టౌన్, ఆగస్టు 25: ఇటీవల విద్యుత్‌శాఖలో చేపట్టిన పదోన్నతులు చట్టవిరుద్ధమని, దీనిపై కోర్టులో సవాల్ చేస్తామని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం టీజీఎస్పీడీసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి పేర్కొన్నారు. బీసీ ఉద్యోగుల కార్యనిర్వాహక సమావేశం ఆదివారం హనుమకొండలో జరిగింది. ఈ సందర్భంగా బి.పి మండల్ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా డిస్కంలు వ్యవహరించాయన్నారు. పదోన్నతులను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 4 న హైద్రాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట మహాధర్నా చేయబోతున్నామని, బీసీ ఉద్యోగులంతా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు నాగెల్లి సదానందం, నీలారపు రాజేందర్, రిటైర్డ్ సీఈ సత్యనారాయణ, కంపెనీ పరిధిలోని 16 జిల్లాల అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ఉన్నతాధికారులు



అమ్మవారిని దర్శించుకున్న ఇరిగేషన్ శాఖ అధికారి కె. ధర్మ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 25: భద్రకాళి అమ్మవారిని ఆదివారం అధికారులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఆదాయపు పన్ను శాఖ అధికారి ఆనంద రాజేశ్వర్ దంపతులు, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ కె.ధర్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వీరికి ఆలయ ఈవో శేషభారతి వీరికి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అయ్ బాబోయ్ ఎంత పొడుగో!

స్టేషన్‌ఘన్‌పూర్‌లో 20 అడుగులు పెరిగిన పచ్చజొన్న కర్రలు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 25: సాధారణంగా పచ్చజొన్న కర్రలు ఐదు లేదా ఆరు అడుగులు పెరుగుతాయి. కాని దానికి మూడింతలు ఎత్తు పెరిగిన మొక్కలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలో మాజీ ఎంపీటీసీ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జోగు కుమారస్వామి ఇంటి ఆవరణలో ఈ వింత మొక్కలు పెరిగాయి. రెండు నెలల క్రితం మూడు పచ్చజొన్న మొక్కలు వాటికి అవే మొలకెత్తాయి. రోజు రోజుకూ అవి ఎదుగుతూ 20 నుంచి 22 అడుగులకు చేరుకున్నాయి. వాటిని చూసిన స్థానికులు ఇంత ఎత్తు ఎలా పెరిగాయని ఆశ్చర్యపోతున్నారు. కాగా భూమిలో ఉన్న సారం ప్రకారం అప్పుడప్పుడు ఇలా ఎత్తు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. కాగా, అవి అంత ఎత్తు పెరిగినా ఇంతవరకు కంకి వేయకపోవడం గమనార్హం.



కాజీపేట ఐటీఐ ఏటీసీ కోసం సోమిడిలో కేటాయించిన స్థలం



వాజేడులోని ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ఐటీఐలకు అధునాతన హంగులు

ఏటీసీల ఏర్పాటుకు మొదలైన భవన నిర్మాణ పనులు ● ఉమ్మడి జిల్లాలో తొలి విడత మూడు ఐటీఐలలో ఏటీసీల ఏర్పాటు

ఒక్కొక్కదాని వ్యయం రూ.40 కోట్లు ● ఐటీఐలకు చేరుకుంటున్న ఏటీసీ ఎక్విప్‌మెంట్

హనుమకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడివరంగల్ జిల్లాలోని మూడు పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఐటీఐ)లలో ఆధునాతన సాంకేతిక శిక్షణా కేంద్రాల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా 24 ఐటీఐలలో ఏటీసీ భవనాల నిర్మాణం పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ, భూపాలపల్లి ఐటీఐ, ఏటూరునాగారం ఐటీఐలలో పనులు మొదలయ్యాయి. ఈఐటీఐలలో చాలినంత స్థలం అందుబాటులో ఉండడంతో వీటిల్లో ఏటీసీ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మిగతా మూడు ఐటీఐలలో కూడా స్థలం అందుబాటులోకి రాగానే పనులు చేపడతారు. వర్షాకాలం కావడం వల్ల ఈ మూడు ఐటీఐలలో పనులకు కొంత ఆటంకం కలుగుతోంది. పిల్లర్ల కోసం తవ్విన కందకాలతో వర్షపు నీరు తరుచూ నిండిపోయి పనులు ముందుకు సాగడం లేదు. ఆరు నెలల్లో భవనాల నిర్మాణం పూర్తయితే ఆ వెంటనే అందుల్లో పరికరాలను అమర్చుతారు. వాస్తవానికి ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ ఏటీసీలలో ప్రవేశాలను కల్పించాల్సి ఉంది. కానీ భవనాల నిర్మాణమే పూర్తికాకపోవడంతో వాయిదా పడింది. ఈలోగా ఏటీసీ ఏర్పాటును పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రవేశాలను కల్పించనున్నారు.



ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ భవన నిర్మాణానికి పిల్లర్ల కోసం తీసిన గుంతలు

అధునాతన..

ఐటీలను ఆధునాతన సాంకేతిక శిక్షణా సంస్థలుగా (ఏటీసీ) మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది తెలిసిందే. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీ లిమిటెడ్‌తో (టీటీఎల్) ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వాటి దశ, దిశ మారనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐలో ఏసీటీలను ఏర్పాటు చేయాలని టీటీఎల్ నిర్ణయం తీసుకున్నది. మొదటి విడతగా 24 ఐటీలను ఏటీసీలను ఏర్పాటు చేయనున్నది. ఇందులోభాగంగా ఉమ్మడి వరంగల్‌లోని మూడు ఐటీఐలో ఏసీటీసీలు ఏర్పాటవుతున్నాయి. టీటీఎల్ ఒక్కొక్క ఏటీసీని రూ. 40కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. టీటీఎల్ మొత్తం రూ.2,324 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ఐటీఐలను అప్ గ్రేడ్ చేస్తోంది. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడెషన్ ప్రాజెక్టులో భాగంగా ఈ ఐటీఐలలో ఆదునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తారు. ఇందులో కోసం అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణలతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

చేరుకుంటున్న పరికరాలు

ఒక పక్క భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే టీటీఎల్ ఏటీసీలో అమర్చాల్సి ఉన్న యంత్ర పరికాలను ఆయా ఐటీఐలకు పంపడం మొదలు పెట్టింది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్)కు సంబంధించిన రోబోటిక్స్ మిషన్స్, డిజిటల్ కటింగ్స్ తదితర పరికరాలు వీటిలో ఉన్నాయి. వీటితో పాటు ఏటీసీలో ఒక ఆధునాతన అడ్వాన్సుడ్ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఇందులో 20 సిస్టమ్స్ ఉంటాయి. ఆటోమొబైల్‌కు కోర్సుకు సంబంధించి బ్యాటరీ చార్జెస్ వెహికిల్ కూడా రానున్నది.

సోమిడిలో ఏటీసీ

కాజీపేటలోని ఐటీఐకి అనుబంధంగా కూడా ఒక ఏటీసీ సెంటర్ ఏర్పాటు కానున్నది. అయితే ఇందులో చాలినంత స్థలం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ పనులు వెంటనే ప్రారంభం కాలేదు. స్థలం కోసం నాలుగైదు చోట్ల పరిశీలించగా చివరికి సోమిడిలో గోదాముల వెనుక గల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. ఏటీసీ ఏర్పాటుకు 25 గుంటల స్థలాన్ని హనుమకొండ కలక్టర్ ప్రావీణ్య ఇటీవల కేటాయించారు. స్థలం అప్పగించే ప్రక్రియ పూర్తికాగానే ఇక్కడ కూడా ఏటీసీ భవనం పనులు మొదలుకానున్నాయి.

ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు

ఐటీఐ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి అవకాశాలు పొందగలిగేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా భాగంగా ఐటీఐ సర్కిల్ డెవప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టులో భాగస్వామి అయింది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా. ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తి నిపుణులను తయారు చేయడానికి ఆరు అధునాతన ట్రేడ్‌లను ఈ ఏసీటీల్లో ప్రవేశపెట్టనున్నది. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫ్యాక్టరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్‌లో ఒక్కొక దానిలో 40 సీట్లు, మిగతా కోర్సుల్లో 48 సీట్ల చొప్పున ఉంటాయి. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఒక్కోక్కదాని రూ. 4.50 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుండగా రూ. 35 కోట్లతో ఏటీసీల్లో ఆధునాతన బోధనా పరికరాలను సమకూరుస్తున్నది.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరావు

సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కర్రె భిక్షపతి

ప్రకటించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



కర్రె భిక్షపతి

బాలసముద్రం, ఆగస్టు 25: తెలంగాణ కమ్యూనిస్టు రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో మూడు రోజులు అట్టహాసంగా జరిగాయి. ఆదివారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఎన్నుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆదివారం బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ప్రకటించారు. రాష్ట్ర సీపీఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సీపీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె భిక్షపతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ.. తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్‌లో చేరి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, ఢిల్లీ కేంద్రంగా జాతీయ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు జాతీయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, రాష్ట్ర నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, బాగం హేమంతరావు, కలవేణ శంకర్, బాలనర్సింహా పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఐనవోలు, ఆగస్టు 25: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సాంస్కృతి సాహితి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేవారికి డాక్టరేట్ బిరుదును అందజేస్తారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈవో, కుటుంబ సభ్యులను సన్మానించి బిరుదు పత్రాన్ని దైవాజ్ఞ శర్మ చేతుల మీదుగా అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలలో సాంస్కృతిక సాహితి సేవా ట్రస్ట్ సేవా కార్యక్రమాలను నిర్వహించే వారిని ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఈవో సందర్భంగా పేర్కొన్నారు.

నర్సంపేటలో దొంగల హల్‌చల్

● తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ ● రూ. 12లక్షల నగదు, 11తులాల బంగారు నగల అపహరణ



నర్సంపేటలో చోరీకి పాల్పడిన ఇల్లు ఇదే..



ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, సీఐ రమణమూర్తి

నర్సంపేట టౌన్, ఆగస్టు 25 : నర్సంపేట పట్టణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడి నగదు, బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లిన ఘటన పట్టణంలో చోటచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం. నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామంలోని కాకతీయ గురుకుల పాఠశాల కరస్పాండెంట్ మేడవరపు కమలాకర్‌రావు తన కుటుంబంతో నర్సంపేటలోని వరంగల్ రోడ్‌లో వివేకానందకాలనీలో నివాసముంటున్నారు. కమలాకర్‌రావు భార్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో తన కుమారుడి వద్ద ఉంటూ చికిత్స పొందుతోంది. కమలాకర్‌రావు తన సహచర ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో పాఠశాల తరఫున సన్మాన కార్యక్రమం ఉండడంతో శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇదే రోజు అర్ధరాత్రి ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం సెంట్రల్ తాళం పగలగొట్టి ఉండడం, లోపలకి వెళ్లగా కప్‌బోర్డు తెరిచి ఉండి, అందులోని నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం చోరీ విషయాన్ని నర్సంపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ రమణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం వరంగల్ నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి దొంగతనం జరిగిన ఇంటితో పాటు పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చోరీలో రూ. 12 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు కమలాకర్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు.

సందడిగా జిల్లా స్థాయి చెస్ పోటీలు

ఉమ్మడి జిల్లాలో 50మంది బాలబాలికలు హాజరు



జిల్లా స్థాయి చెస్ పోటీలను ప్రారంభిస్తున్న క్రీడల కార్యనిర్వాహణ కార్యదర్శి కన్న

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 25: తెలంగాణ చెస్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని రోజరీ పాఠశాలలో జిల్లా స్థాయి అండర్-9 బాల బాలికల చెస్ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి క్రీడా పోటీల నిర్వాహణ కార్యదర్శి కన్న ముఖ్య అతిథిగా హాజరై చెస్ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడలో పాల్గొనడం ద్వారా మేధో సంపత్తి పెంపొందుతుందన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆశాభవం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలలో సుమారు 50మంది బాల బాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సెప్టెంబరు నెల చివరి వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సునీల్‌రెడ్డి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మామిడాల కుశాల్‌కు మహా నంది పురస్కారం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 25: హనుమకొండలోని రాయపుర ప్రాంతానికి చెందిన మామిడాల కుశాల్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలుగు సంస్కృతి సాహితీసేవా ట్రస్టు ఆధ్వర్యంలోనిర్వహించిన కార్యక్రమంలో మహా నంది పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.


ఆ పత్రికకు 102 ఏళ్లు



నిజాం నిర్బంధకాలంలో ప్రజలను చైతన్యపరిచిన 'తెనుగు' పత్రిక

మారుమూల గ్రామంలో పత్రిక స్థాపించిన ఒద్దిరాజు సోదరులు

రేపు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు



పత్రిక వ్యవస్థాపకులు ఒద్దిరాజు సోదరులు



ఇనుగుర్తిలోని ఈ ఇంటి నుంచే తెనుగు పత్రిక వెలువడింది

మహబూబాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిజాం ప్రభుత్వం నిర్బంధం కొనసాగిస్తున్న కాలంలో ప్రజలను చైతన్య పరిచి.. స్వాతంత్రోద్యమ వైపు నడిపించి, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అణిచివేయబడ్డ తెలంగాణ ప్రజలను మెల్కోలిపేందుకు ఒద్దిరాజు సీతారామచందర్‌రావు, రాఘవరంగారావు సోదరులు నడుం బిగించారు. సహజమైన కవులు, రచయితలు కావడం చేత ఆ కాలంలోనే జర్నలిస్టులుగా మారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారు మూల గ్రామమైన ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గ్రామంలో మద్రాసు నుంచి ముద్రణాలయం (ప్రింటింగ్ మిషన్) తెప్పించి, 'తెనుగు' పత్రికకు పురుడు పోశారు. ఆ పత్రిక ద్వారా ప్రజలను చైతన్య పరిచి తెలంగాణ ఉద్యమం వైపుకు నడిపించడంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణలోనే మొట్టమొదటి తెలుగు పత్రిక తెనుగు పత్రిక స్థాపించి ఈ నెలతో 102 ఏళ్ల పూర్తి కావొస్తుంది. తన కలాన్ని పదును పెట్టి తెలంగాణ ప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు పత్రికను పంపించి ప్రజలను చైతన్య పరిచారు. ఈ పత్రిక స్థాపించి వందేళ్ల పూర్తయిన నేపథ్యంలో ఒద్దిరాజు సోదరుల కుటుంబసభ్యులు, బంధువులు, ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 27న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ప్రముఖ పాత్రికేయులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆ తెనుగు పత్రికపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

'తెనుగు' పత్రికకు శ్రీకారం..

నిజాంలు పాలించిన తెలంగాణ ప్రాంతంలో 1922 వరకు తెలుగు పత్రికలు ప్రారంభం కాలేదు. హైదరాబాద్ నగరం నుంచి 19వ శతాబ్దంలో వెలువడిన కొన్ని అంగ్ల, ఉర్దూ పత్రికలపై నిజాం ప్రభుత్వం అనేక అంక్షలు విధించింది. బ్రిటిష్ పాలకులకు, నిజాం ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే రాతలు ఆ కాలంలో రాయకూడదు. అప్పట్లో ప్రచురితమైన తెలుగు పత్రికలు అనేక నిర్బంధాలకు గురయ్యాయి. అంధ్రా ప్రాంతంలో అదే సమయంలో నాటి బందరు నేటి మచిలీపట్నం నుంచి కృష్ణా పత్రిక వెలువడుతుండేది. ఒద్దిరాజు సోదరులు బందరు వెళ్లి ముట్నూరి కృష్ణారావును కలిసి తాము కూడా పత్రిక స్థాపిస్తే ఎలా ఉంటుందని, ఇనుగుర్తి గ్రామంలో స్థాపించేందుకు సలహా ఇవ్వాలని కోరడంతో కృష్ణారావు దానికి బాగుంటుందని సలహా ఇచ్చారు. ఒద్దిరాజు సోదరులు ఇనుగుర్తి సొంత గ్రామంలో పత్రికను నడిపేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో నిర్బంధ కాలంలోనే తెలంగాణ ప్రజలను మెల్కోల్పేందుకు ఒద్దిరాజు సోదరులు తెనుగు పత్రికకు శ్రీకారం చుట్టారు. 1922 ఆగస్టు 28న ఈపత్రికను ప్రారంభించారు. పత్రిక ముద్రణకు కావాల్సిన రూ.6వేల విలువైన వార్‌ఫెడిల్ మిషన్, ట్రెడిల్ మిషన్ ఖరీదుచేసి సొంతంగా విజ్ఞాన ప్రచారిణి అనే ముద్రణాలయాన్ని స్థాపించి తెనుగు పత్రిక (వారపత్రిక)గా నడిపించారు.

ప్రజలే చైతన్యంగా..

పత్రికను స్థాపించిన ఒద్దిరాజు సోదరులకు పత్రికను వివిధ గ్రామాలు, పట్టణాలు, రాష్ట్రాలకు పంపించేందుకు సమస్యగా మారింది. వారానికి రెండ్రోజులు మాత్రమే వెలువడే ఈ తెనుగు పత్రికను నిజాం నిరంకుశ ప్రభుత్వ పాలన కింద సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేయబడుతున్న తెలంగాణ ప్రజలను మెల్కోలిపే వార్తలను ఒద్దిరాజు సోదరులు ప్రచురించే వారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఇలాంటి వార్తలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. అలాంటి వార్తల పత్రికను ఇనుగుర్తిలో పోస్టాఫీస్ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు తరలించే వీలు లేకుండాపోయింది. దాంతో ఒద్దిరాజు సోదరులు హైదరాబాద్‌కు వెళ్లి పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులను కలిసి గ్రామానికి పోస్టాఫీసును మంజూరు చేయించారు. పత్రికకు వార్తలు, వ్యాసాలు రాసేందుకు, చందాదారులుగా చేర్పించడానికి, చేరడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వారే స్వయంగా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సూర్యాపేట, విజయవాడ, బందరు, చెన్నై, మానుకోట ప్రాంతాల్లో తిరిగి సంవత్సరం చందా దారులను తయారు చేసి పోస్టాఫీసు ద్వారా పత్రికను చేరవేసేవారు. నాటి కాలంలో ఆ పత్రికకు సంవత్సరపు చందా మూడు రూపాయలే. వారానికి 500 కాపీలను ముద్రించి పోస్టు ద్వార చందాదారులకు పంపేవారు. ఈ పత్రికకు మంచి స్పందన రావడం తో హైదరాబాద్ నుంచి బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమం తరావు, వెంకటేశ్వర్‌రావు, కోదాటి రామకృష్ణారావు లాంటి ప్రముఖులు కూడ ఈ తెనుగు పత్రికకు వార్తలు పంపడం విశేషం.

ప్రముఖుల వ్యాసాలు..

ఒద్దిరాజు సోదరుల బంధువైన నల్గొండకు చెందిన షబ్నాలిస్ వెంకటనర్సింహారావు ఒద్దిరాజు సోదరుల సలహాతో 1923లో నల్గొండలో 'నీలగిరి' అనేక పత్రికను స్థాపించారు. ఏడాది పాటు ఇనుగుర్తిలోనే వద్దిరాజు సోదరుల ప్రింటింగ్ ప్రెస్‌లో ఆ పత్రిక ప్రింటింగ్ చేసి నల్గొండకు పంపించేవారు. అయితే రజాకార్ల సమయంలో బహుముఖ కవి, రచయితలు కావడంచేత అనేక గ్రంథాలు రాశారు. ఒద్దిరాజు సోదరులు రాసిన చాలా గ్రంథాల్లో కొన్నింటిని ప్రచురించగా, చాలా వరకు ప్రచురించలేకపోయారు. చేతివృత్తులపై వారు రాసిన అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ సోదరులు రాసిన సౌదామిని పరిణయం అనే గ్రంథం నుంచి కొంత భాగాన్ని కాకతీయ యూనివర్సిటీ కూడా సేకరించి దాన్ని పాఠ్యాంశంగా మార్చి విద్యార్థులకు బోధన చేశారు. రజాకార్లు ఇనుగుర్తిలోని ఒద్దిరాజు సోదరుల ఇంటికి వెళ్లి వారు రాసిన అనేక గ్రంథాలను తగలబెట్టడంతో పాటు విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒద్దిరాజు సోదరులు ఆ తర్వాత పత్రికను వరంగల్ జిల్లా కేంద్రానికి మార్చారు. అయితే కొన్ని నెలల వరకే పత్రిక నడిచి పలు కారణాలతో ప్రచురణ ఆగిపోయింది. పత్రిక నిలిచి పోయింది. కాగా, ఒద్దిరాజు సోదరులు నివసించిన, పత్రిక నిర్వహించిన భవనం ప్రస్తుతం ఎవరూ లేకపోవడంతో పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తెలంగాణలో మొట్టమొదటి తెలుగు భాషలో వెలువడిన తెనుగు పత్రిక స్థాపించిన ఈ భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

27న ఇనుగుర్తిలో శతాబ్ది వేడుకలు..

ఇనుగుర్తి గ్రామానికి చెందిన ఒద్దిరాజు సీతారామచందర్ రావు, రాఘవ రంగారావు కలిసి తెలంగాణలో తెనుగు పత్రికను స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న ఇనుగుర్తి రైతు వేదికలో శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఒద్దిరాజు సుభాష్ తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖ పాత్రికేయులు, ఒక దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులకు కూడా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయుల సంఘాల బాధ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాజర్నలిస్టులు పాల్గొని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

గిర్మాజిపేట, ఆగస్టు 25: సికింద్రాబాద్ నుంచి వరంగల్ వస్తున్న రైలు నుంచి జారి పడి మహిళ మృతిచెందిన ఘటన హంటర్ రోడ్డు శాయంపేట రైల్వేగేటు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ కథనం ప్రకారం. హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన సాదియా(42) 4 నెలలుగా సికింద్రాబాద్ లాలాగూడలో కుమారుడు సల్మాన్, కూతురు సల్మాతో ఉంటోంది. ఆదివారం తెల్లవారుజామున సికిందరాబాద్ నుంచి వరంగల్‌కు రైల్లో వస్తున్న సాదియా శాయంపేట రైల్వేగేటు వద్ద రైలు నుంచి జారి పట్టాలపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా సాదియాగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి, ఎంజీఎం మార్చురీకి తరలించారు. సాయంత్రం మృతదేహాన్ని లష్కర్‌బజార్‌లోని మృతురాలి తల్లి రహముస్సీసా బేగంకు అప్పగించి ఎస్సై మోహినుద్దిన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన సతీష్‌రెడ్డి


కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న సతీష్‌రెడ్డి

ములుగు, ఆగస్టు 25: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రెడ్‌కో మాజీ చైర్మన్ వై.సతీష్‌రెడ్డి ఆదివారం కలిశారు. తన పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

నాట్య మయూరి అవార్డుకు ఎంపిక


అలక నంద


మల్హర్, ఆగస్టు 25: మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన అలకనంద రాథోడ్ నాట్య మయూరి అవార్డుకు ఎంపికైంది. మదర్‌థెరిసా జయంతి సందర్భంగా ఎక్స్‌-రే లిటరరీ కల్చరల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న కార్యక్రమంలో నృత్య ప్రదర్శన అనంతరం ఈ అవార్డును అలకనంద అందుకోనున్నారు.

కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయండి

కాటారం, ఆగస్టు 25: మండల కేంద్రంలో సోమవారం గారెపల్లి అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు తొట్ల శ్రీశైలం కోరారు. మండల కేంద్రంలో ఆదివారం యాదవ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. ఉదయం గారెపల్లి భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు అనంతరం శ్రీకృష్ణుడి రథోత్సవం జరుగుతుందన్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం, మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు అన్ని వర్గాల ప్రజలు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సింగనవేన చంద్రశేఖర్, కొటపర్తి తిరుపతి, తొట్ల శంకర్, శ్రీకాంత్, శ్రీశైలం, ములకల తిరుపతి పాల్గొన్నారు.

రైతన్నలకు ఊరట

- రుణమాఫీ కాని వారికి సర్కారు శుభవార్త
- వివరాలు సేకరించనున్న సర్కారు
- ఏవోలకు ప్రత్యేక బాధ్యతలు
- ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 2,200 మంది
- తప్పులు సరి చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్న అధికారులు



కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 25: వివిధ కారణాలతో కాని రైతులకు ప్రభుత్వం శుభవార్తే చెప్పింది. వారి వివరాలను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో కారణాలు కనుగొని అర్హులైన వారికి తప్పక రుణమాఫీ చేసేందుకు రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తోంది. దీనికి ఏవోలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే మొదటి విడత నుంచి మొదలు మూడో విడత వరకు రుణ మాఫీ కాని రైతులు ఆయా మండల వ్యవసాయశాఖ అధికారులకు జిల్లా వ్యాప్తంగా 2,200 మంది దరఖాస్తులు సమర్పించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీకి కాంగ్రెస్ సర్కారు ప్రారంభించింది. మూడు విడతలు చేసినప్పటికీ ఇంకా చాలా మందికి మాఫీ కాలేదు. దీంతో అసలు రైతులకు ఎందుకు మాఫీ కాలేదనే విషయాల్ని ఫిర్యాదు రూపేణా స్వీకరించేందుకు ఏవోలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఒక్కో రోజు ఒక్కో గ్రామానికి వెళ్లి వారు రైతుల వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఏవోలను రైతులు నేరుగా కూడా కలిసి దరఖాస్తు ఇవ్వొచ్చు. బ్యాంకులో ఉన్న లోను వివరాలు, పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలు జతచేసి ఇవ్వాలి. మరోవైపు ఈనెల 27 నుంచి కుటుంబ నిర్ధారణ సర్వే కూడా అధికారులు ఇంటింటా తిరిగి చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

ప్రత్యేక పోర్టల్‌లో నమోదు

వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల పూర్తి వివరాలను అధికారులు ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశానుసారంగా క్రాప్‌లోన్ వీవర్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందు పరుసున్నారు. బ్యాంకర్ల కారణంగా జరిగిన తప్పిదాలు, కుటుంబ నిర్ధారణ కానివి, మిస్సింగ్ డేటా, రేషన్‌కార్డు లేని వారివి, ఒకే రేషన్ కార్డుపై ఇద్దరు రుణం పొందడం, పట్టా పాస్‌బుక్ లేకుండా రుణం పొందడం, పాస్ బుక్ సమర్పించకపోవడం వంటి కారణాలను గుర్తించి వివరాలను ఆయా పోర్టల్‌లో పొందుపరుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మూడు విడతల్లో ఇలా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఆదేశాలతో ఇక్కడి అధికారులు మూడు విడతల్లో రుణమాఫీ చేపట్టారు. మొదటి విడతలో 16,502 మందికి రూ.85.25 కోట్లు, రెండో విడతలో 8754 మందికి రూ.95.94 కోట్లు, మూడో విడతలో 6753 మందికి రూ.113.40 కోట్ల వరకు రుణమాఫీ జరిగింది. ఈ లెక్కన మూడు విడతల్లో ఇప్పటి వరకు 32,009 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. ఇంకా సుమారు 20 వేల పైచిలుకు మందికి రుణమాఫీ జరగాల్సి ఉంటుందని అంచనా ఉంది. వీరిలో ఇప్పటికే 2,200 మంది రుణమాఫీ కాని రైతులంతా అధికారులకు అర్జీలు పెట్టుకున్నారు. ఇంకా 20వేల మంది వరకు రైతులు వారివారి వివరాలను అధికారులు అందించాల్సి ఉంది. దరఖాస్తుల స్వీకరణ పూర్తి అయ్యాక అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ రైతుల్లో నెలకొంది.

రేపటి నుంచి కోతులు, కుక్కల పట్టివేత

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 25: భూపాలపల్లి పట్టణంలో కోతులు, కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. వీటి దాడిలో అనుదినం ఐదారుగురు గాయాలపాలవుతున్నారు. దీంతో పలు కాలనీల వాసులు మునిసిపల్ అధికారులకు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణకు ఈ సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మునిసిపల్ అధికారులతో సమావేశమయ్యారు. కోతులు, కుక్కల బెడద నుంచి పట్టణ ప్రజలకు రక్షణ కల్పించాలని, వెంటనే వాటిని పట్టుకునేందుకు నిపుణులను పిలిపించాలని ఆదేశించారు. ఈ క్రమంలో కోతులను పట్టుకునేందుకు ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి కాంట్రాక్టు అప్పగించారు. ఒక్కో కోతికి రూ.300 ఖర్చు చేయనున్నారు. అలాగే కుక్కల బాధ నుంచి కూడా ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నట్టు మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ తెలిపారు.

ఒకటో తేదీ నుంచి పశుగణన

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 25: జాతీయ 21వ పశుగణన సెప్టెంబరు 1 నుంచి జిల్లాలో చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోపాలకృష్ణమూర్తి ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. పశుగణన డిసెంబరు 31 వరకు పశుగణన కొనసాగనుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలు ఇతర పశువుల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా విశ్వనాథ్



ములుగు, ఆగస్టు 25: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా సూర్యదేవర విశ్వనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడుక సిరికొండ బలరాం ప్రకటించారు. జిల్లా కేంద్రానికి చెందిన విశ్వనాథ్ విద్యార్థి దశ నుంచే స్వయం సేవక్‌గా, ఏబీవీపీ కార్యకర్తగా పనిచేశారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత ములుగు పట్టణ ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు పనిచేశారు. మండల ప్రధాన కార్యదర్శిగా, భూపాలపల్లి జిల్లా కార్యదర్శిగా, వెంకటాపూర్ మండల ఇన్‌చార్జిగా సేవలందించారు. తనను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడంపట్ల హర్షం వ్యక్తంచేసిన విశ్వనాథ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజేంద్రప్రసాద్



కాటారం, ఆగస్టు 25: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన పూసల రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆదివారం నియామకపు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పార్టీ నాయకుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బీసీలను చైతన్య పరుస్తూ వారికి వెన్నంటి ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నిశీధర్‌రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై సందీప్‌కుమార్

రేగొండ, ఆగస్టు 25: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని ఎస్సై సందీప్ కుమార్ అన్నారు. మండలంలోని దుంపిల్లపల్లి గ్రామంలో యూత్ సభ్యులకు ఆదివారం రోజున ఎస్సై సందీప్ కుమార్ రెండు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఏదైనా నేరాలు, అక్రమ రవాణా వంటివి జరిగితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. మాజీ సర్పంచ్ భాస్కర్, విద్యార్థి నాయకుడు వినయ్‌కుమార్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డీఎన్ రావుకు ఘన నివాళి


నర్సింగరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

ములుగు, ఆగస్టు 25: ఆదివాసీల హక్కుల నేత, తుడుందెబ్బ వ్యవస్థాపకుడు దబ్బకట్ల నర్సింగరావుకు ప్రజాసంఘాల నాయకులు ఘన నివాళులర్పించారు. ములుగులోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో ఆదివారం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బాదం ప్రవీణ్, ప్రజాసంఘాల జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతి, కుక్కల నాగరాజు, బండి మధు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

- ములుగు రూరల్ : తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బకట్ల నర్సింగరావు వర్ధంతిని ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు వజ్జ రాజు ఆధ్వర్యంలో రాయినిగూడెంలో నిర్వహించారు. నర్సింగరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింగరావు సతీమణి దబ్బగట్ల సమ్మక్క, తుడుందెబ్బ నాయకులు తవిటి నారాయణ, చెరుకుల రాకేష్, మాజీ సర్పంచ్ స్వామి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పొలాల్లోకి వర్షపు నీరు


పత్తి చేనులో చేరిన వర్షపు నీరు

కాటారం, ఆగస్టు 25: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో ఉన్న పత్తి చేలల్లోకి, వరి పొలాల్లోకి వరదనీరు చేరి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా వరసగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోతోందని ఆందోళన చెందుతున్నారు. వర్షంతో చెరువులు, కుంటలు మరోసారి మత్తళ్లు దుముకుతున్నాయి.

రోడ్డంతా చిత్తడి.. చిత్తడి


అధ్వానంగా మారిన రహదారి

మల్హర్, ఆగస్టు 25: మండల కేంద్రమైన తాడిచర్ల ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీ మీదుగా సుంకరిపల్లెకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. వర్షపు నీరు చేరి గుంతలమయంగా తయారైంది. ఇక్కడే మిషన్ భగీరథ పైప్ లీకేజీతో నిత్యం రోడ్డుపై నీరు పారి చిత్తడిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. అధికారులకు ఈ విషయాన్ని దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అలాగే పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడం వల్ల గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని అంటున్నారు.

మృతుడి కుటుంబానికి గ్రామస్థుల చేయూత

కాటారం, ఆగస్టు 25: మండలంలోని ఎర్రగుంటపల్లిలో మృతి చెందిన ఖమ్మం చంద్రయ్య కుటుంబానికి గ్రామస్థులు చేయూతను అందించారు. గ్రామపెద్దలు, యువకులు చంద్రయ్య కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. 'మా పల్లె-మా కుటుంబం' అనే నినాదంతో గ్రామస్థులు అందరూ కలిసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

కొత్తమల్లూరులో ఇల్లు దగ్ధం


కొత్తమల్లూరులో కాలిపోతున్న ఇల్లు

మంగపేట, ఆగస్టు 25 : అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మంగపేట మండలం కొత్తమల్లూరులో బోనాల పండుగను నిర్వహించారు. గ్రామస్థురాలు రెబ్బల రమ కూడా అందులో పాల్గొని మహిళలతో గ్రామదేవత గుడికి వెళ్లింది. భర్త రాములు వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో వీరి ఇంట్లోంచి ఒక్కసారిగా మంటలు రావడం మొదలయ్యాయి. గ్రామస్థులు ఎంత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. పది తులాల వెండి, రెండు తులాల బంగారం, రూ. లక్ష విలువ గల సామగ్రి బూడిదయ్యాయి. దీంతో ఆ కుటుంబమంతా కట్టుబట్టలతో మిగిలారు. బాధిత దంపతులకు అంగవైకల్యం ఉన్న కుమారుడితోపాటు మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామాల్లో బోనాల సందడి



వాజేడు, ఏటూరునాగారంలో బోనాలతో అమ్మవార్ల గుళ్లకు వెళ్తున్న మహిళలు

వాజేడు, ఆగస్టు 25: మండలంలో శ్రావణమాసం పురస్కరించుకొని బోనాల సందడి నెలకొంది. మండల కేంద్రంతోపాటు గుమ్మడిదొడ్డిలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని గ్రామాల్లో ఉన్న ముత్యాలమ్మకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం డోలు వాయిద్యాల నడుమ ఈ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలతో గ్రామాలు హోరెత్తాయి.

- ఏటూరునాగారం: మండలంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉన్న ముత్యాలమ్మ దేవాలయంలోని పోచమ్మ తల్లికి మొక్కలు సమర్పించారు. ఆకులవారిఘణపురంలోని పోచమ్మ దేవాలయంలో మొక్కలు చెల్లించుకున్నారు. బెల్లం, కుంకుమ, పసుపుతో తయారు చేసిన ధూపదీప నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. పాడి పంట సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చీరె, సారె, కోళ్లు, యాటలను సమర్పించుకున్నారు. పోచమ్మ గుడి వద్ద ఉన్న రావిచెట్టుకు ముడుపులు కట్టారు.
- మంగపేట: మండలంలో మహిళలు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కు లను చెల్లించుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

15 మందిపై కేసు నమోదు

వాజేడు, ఆగస్టు 25: పేకాట స్థావరంపై వాజేడు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్సై ఆర్.హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొంత మంది వ్యక్తులు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతూ పోలీసులకు కంటపడ్డారు. పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని పట్టుకున్నారు. 250 పేకాట కార్డ్స్, రూ. 22,300 స్వాధీనం చేసుకొని 15 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో సీఆర్పీఎఫ్ డీఎస్పీ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మహదేవపూర్, ఆగస్టు 25 : మండలంలోని కాళేశ్వరం స్టేషన్ పరిధిలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద, బస్టాండ్ ఏరియాలో ఎస్సై చక్రపాణి నేతృత్వంలో పోలీసులు వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. కాగితాలు సరిగ్గాలేని వాటికి ఫైన్‌లు వేశారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై చక్రపాణి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడూ డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు పొంది ఉండాలని తెలిపారు.

గుడుంబా పట్టివేత

మహదేవపూర్, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సొన్నరి రమాదేవి అనే మహిళ ఇంటి వద్ద గుడుంబా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై కె.పవన్‌కుమార్ వెంటనే ఆది వారం ఆమె ఇంట్లో తనిఖీ చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. రమాదేవిపై కేసు నమోదు నమోదు చేశారు.

దళితులను విభజిస్తున్న పాలకులు

టీఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగెర్ల రాజరత్నం


నినదిస్తున్న మాలమహానాడు నాయకులు

మంగపేట, ఆగస్టు 25: ఎస్సీల వర్గీకరణ పేరుతో దళితులను విభజించి పాలించాలని ప్రభుత్వాలు యత్నిస్తున్నాయని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగెర్ల రాజరత్నం విమర్శించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు మంచాల నాగేంద్రకుమార్ అధ్యక్షతన మండల కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా అత్యవసర సమావేశంలో రాజరత్నం మాట్లాడారు. ఏబీసీడీల వర్గీకరణతో భవిషత్‌లో దళిత జాతుల మనుగడకే పెను ప్రమాదమన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ ఉప కులాలు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధికార ప్రతినిధి గులగట్టు సంజీవ, టీఎంఎం జిల్లా అధ్యక్షుడు కర్రి శ్యాంబాబు, మహిళా జిల్లా అధ్యక్షురాలు పుల్లి స్వరూప, మండల నాయకులు జానపట్ల జయరాజ్, గంగెర్ల శ్రీను, మంగ పవన్, కాపుల నాగేశ్వర్‌రావు, బేతం నర్సింహారావు, కూకట్ల శ్రీను, బాణాల సతీష్, బోడ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం ప్రభుత్వంతో పోరాడతాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

బాలసముద్రం, ఆగస్టు 25: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మిత్రపక్షంగా ఉంటూనే ప్రజల సమస్యల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని నల్లగొండ, ఖమ్మంలో ఎక్కువ సీట్లు గెలుపొందిందన్నారు. కానీ సీపీఐతో మిత్రబంధం పాటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎక్కువ హామీలు ఇచ్చి పట్టించుకోవడంలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. మంత్రుల మధ్య సమన్వయ లోపంతో ఒకరు చెప్పిన మాటకు మరొకరు చెప్పిందానికి సంబంధం ఉండడంలేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకపోయినా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై రాళ్లు వేస్తున్నారని అన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని, లేకుంటే రైతులు రుణమాఫీపై రైతులు ధర్నాలు చేస్తే సీపీఐ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సామన్య ప్రజలు భయపడుతున్నట్లు, హైడ్రా నుంచి సామాన్యులకు విముక్తి కల్పించాలని సాంబశివరావు సూచించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ వీడేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రస్తుత విలువలు లేని రాజకీయాలు ఎవరు చేసినా మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలపై చర్యలు ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులకు పాల్పడితే సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు.